క్లుప్తంగా

ఈ నెల 14, 15 తేదీల్లో దివ్యాంగ ధ్రువీకరణ పత్రాల జారీ

యానాం: నియోజకవర్గ పరిధిలో ఈ నెల 14, 15 తేదీల్లో దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి డీడీ టి.రవిశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ పత్రాల కోసం ఈ నెల 8, 9, 11 తేదీల్లో సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, పరంపేట, మెట్టకూరు, కనకాలపేటల్లోని సబ్‌సెంటర్లలో పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. యానాం పట్టణ ప్రజలు మాత్రం ఆధార్, రేషన్ కార్డులు తీసుకెళితే జీజీహెచ్‌లో పేర్లు నమోదుచేస్తారని తెలిపారు.

రాతపరీక్ష ఫలితాల విడుదల

యానాం: పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో ఫీల్డ్ సర్వేయర్ పోస్టులకు ఈ నెల 3న జరిగిన రాతపరీక్ష ఫలితాలను వ్యవసాయశాఖ కార్యదర్శి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎల్.కుమార్ బుధవారం విడుదల చేశారు. యానాం నుంచి పేరాబత్తుల వీరబాబు, శుభశ్రీ, డొక్కాడి సోమశేఖర్, పోతుల రవిదీప్, గిడ్డి రామకృష్ణ, కొల్లు రంజిత్ కుమార్, చిరపూరి వంశీవర్మ, పేరాబత్తుల నాగభూషణం ఎంపికయ్యారు.

దోమల నివారణ కోసం ఫాగింగ్



తాళ్లరేవు సంతపేట సెంటర్‌లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: వర్షాల నేపథ్యంలో గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయిస్తున్నామని తాళ్లరేవు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి తెలిపారు. దోమల కారణంగా స్థానిక సామాజిక ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో ఆస్పత్రి పరిసరాల్లో సైతం ఫాగింగ్ చేయించారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ, నాయకులు రెడ్డి రెడ్డిబాబు, చిట్టూరి చలపతి, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు.

10న కార్తిక అన్నసమారాధన

యానాం: యానాం నియోజకవర్గం, పరిసర ప్రాంతాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో పవిత్ర కార్తికమాసంలో ఈ నెల 10న కార్తిక అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గౌతమీగోదావరి తీరం ఫెర్రీరోడ్డులో హరిహర మహాయజ్ఞాన్ని నిర్వహిస్తామన్నారు. అన్నసమారాధనలో యానాం పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ముమ్మిడివరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని అన్నంపల్లి, గాడిలంక గ్రామాల్లో సర్పంచ్‌లు మట్టపర్తి సత్యనారాయణ, పెద్దిరెడ్డి మునీంద్రరరావు అధ్యక్షతన అవగాహన సదస్సులు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 14 పథకాలకు సంబంధించిన వివరాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ జె.రాంబాబు, ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, డా.రాహుల్, గిరిగి వీరదుర్గాకుమారి, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరునికి లక్షరుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామివారు

తాళ్లరేవు: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా స్థానిక పురాతన శివాలయంలో బుధవారం లక్ష రుద్రాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష రుద్రాక్ష పూజ, లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, చండీ హోమం, సాయంత్రం కార్తిక దీపోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహానటి సావిత్రికి ఘన నివాళి

తాళ్లరేవు: మహానటి సావిత్రి జయంతి సందర్భంగా బుధవారం తాళ్లరేవులోని గాంధీనగర్‌లో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు, గాయకుడు వాకపల్లి చిరంజీవి తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

తుపాను సహాయక చర్యలపై సమీక్ష

అల్లవరం: మిచాంగ్ తుపాను సహాయక చర్యలపై ఎంపీడీఓ కృష్ణమోహన్ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల భద్రత, విద్యార్థులకు సరఫరా చేస్తున్న తాగునీటిని క్లోరినేషన్ చేయడం, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పైపులైన్ల నష్టం అంచనాలు తయారీ, సేవలను పునరుద్ధరించడం తదితర విషయాలపై సమీక్షించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డి.రావులపాలెంలో భారీ వర్షాలకు నేలమట్టమైన వరి చేలు



అమలాపురంలో జలదిగ్బంధంలో చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం



అన్నంపల్లిలో నేలకొరిగిన అరటి మొక్కలు



తాళ్లరేవులో నీటమునిగిన వరిచేలను పరిశీలిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత



జలదిగ్బంధంలో అమలాపురం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

నిండా ముంచిన మిచాంగ్

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు

అల్లవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాల వరి పంట ముంపునకు గురైంది. ప్రధానంగా మంగళవారం రాత్రి కురిసిన కుంభవృష్టి వర్షానికి అనేకచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ముంపు నీటితో కాలువలు, రెవెన్యూ డ్రెయిన్లు, మేజర్ డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వేలాది ఎకరాల్లో వరి పంట నేలమట్టమైంది. అనేకచోట్ల పంటను ఒబ్బిడి చేసుకునే మార్గం లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన పడుతున్నారు. మరోవైపు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం శరవేగంగా సహాయక చర్యలు చేపట్టింది. ముంపులో చిక్కుకున్న కాలనీల్లో ప్రొక్లెయిన్‌ల సహాయంతో ముంపు నివారణ చర్యలను ఆగమేఘాలపై చేపట్టారు. వరి పొలాల్లోని ముంపు నీరు దిగేందుకు ఉపాధి కూలీలతో పంట బోదెలు, రెవెన్యూ డ్రెయిన్లలో చెత్తా చెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు.

జిల్లా కేంద్రంలో ఇళ్లలోకి నీరు

అమలాపురం టౌన్: గత మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో 1, 5, 10, 11, 14, 27, 28, 29 వార్డుల్లో అనేక ఇళ్లు ముంపుబారిన పడ్డాయి. ప్రధానంగా హౌసింగ్ బోర్డు కాలనీ, సావరం, రావులచెరువు, మెట్ల కాలనీ తదితర వీధుల్లో సుమారు 160 ఇళ్లలోకి ముంపునీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక పురాతన శివక్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి, సూర్యనారాయణపేటలోని రామాలయం జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి ముంపు నీరు పోయేలా చర్యలు చేపట్టారు.



అమలాపురంలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

ముమ్మిడివరం/కాట్రేనికోన: మిచాంగ్ తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం వర్షం తెరిపినివ్వడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఈదురుగాలులకు అరటి చెట్లు, కాయగూరల తోటలు దెబ్బతిన్నాయి. అమలాపురంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వర్షం నీటితో ముంపునకు గురైంది. అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో పాటు తీగలు తెగిపడ్డాయి. దీంతో అధికారులు శరవేగంగా మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోగా రెస్క్యూ టీమ్ యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి వాటిని తొలగించింది. తుపాను ప్రభావం వల్ల ముంపుబారిన పడిన ప్రాంతాల్లో నష్టాలు అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలతో తుపాను సహాయక ప్రత్యేక అధికారి కె.వెంకట్రావు, అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డిల పర్యవేక్షణలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒక్క కాట్రేనికోన మండలంలోని గెద్దనపల్లి, కాట్రేనికోన, దొంతుకుర్రు, చెయ్యేరు, ఉప్పూడి లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రొక్లెయిన్లతో డ్రైన్లలో పూడికలు తీయించడంతో 800 ఎకరాలు ముంపు నీటి నుంచి బయటపడ్డాయి. కాట్రేనికోనలో గాలులకు నేల కూలిన, విరిగిన విద్యుత్ స్తంభాల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను ఏఈ బి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు.

బాధితులకు ధైర్యం చెప్పిన నేతలు

తాళ్లరేవు: మిచాంగ్ తుపాను కారణంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం ఆమె తాళ్లరేవు పంచాయతీ పరిధిలో నీట మునిగిన వరి పొలాలను, తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులెవరూ అధైర్యపడవద్దని జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తడిసిన, రంగుమారిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలు తదితరులు ఉన్నారు.

- అల్లవరం మండలంలోని గూడాల, తాడికోన, ఎంట్రుకోన గ్రామాల్లో తుపాను ప్రభావంతో ముంపునకు గురైన వరి పొలాలను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాకారపు చిరంజీవిరావు, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నష్టాల అంచనాలో అధికారులు

- తుపాను కారణంగా నష్టపోయిన బాధితులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల పలు తాటాకిళ్లు నేలమట్టం కాగా, వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులను గుర్తిస్తున్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది నీటమునిగిన వరిపొలాలు, తడిసిపోయిన పనలు, ధాన్యం రాసులను పరిశీలిస్తున్నారు. నష్టపోయిన ప్రతీ ఒక్కరికీ పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.
- ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. దాదాపు 40 శాతం వరికోతలు పూర్తయ్యాయి. తుపాను ప్రభావంతో సుమారు 12 వేల ఎకరాల వరి చేలు నేలకొరగగా, కోత కోసి పనలపై ఉన్న 250 ఎకరాలు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలంలోని తిల్లకుప్ప, మురముళ్ళలో ముంపుబారిన పడిన వరి పొలాలను వ్యవసాయశాఖాధికారులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.



తాళ్లరేవు జిల్లావారిపేటలో తుపాను కారణంగా పాడైపోయిన గృహాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



బక్కివారిపేట వద్ద ప్రొక్లెయిన్ సాయంతో డ్రైన్‌లో పూడికలు తీస్తున్న దృశ్యం



మురముళ్ళలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తడిసిన ధాన్యం పనలు సంరక్షించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అమలాపురం రూరల్: తుపాను ప్రభావిత ప్రాంతాలైన కామనగరువు, చిందాడగరువు, సమనస గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు బుధవారం పర్యటించారు. వరిచేల కమతాల్లోకి వెళ్లి తడిసిన ధాన్యం రాశులను పరిశీలించి ధాన్యాన్ని ఎలా సంరక్షించుకోవాలో రైతులకు వివరించారు. తడిసిన పనల మీద 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ వల్ల మొలక శాతాన్ని తగ్గించడమే కాకుండా ధాన్యం రంగు మారకుండా నివారించొచ్చన్నారు. రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్, చిందాడగరువు సర్పంచ్ నక్కా చంద్రశేఖర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యంపై ఉప్పు ద్రావణాన్ని చల్లిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

క్రిస్మస్‌తో లోకానికి కొత్త కాంతులు

ఐక్య కిస్మస్ వేడుకల్లో మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: కిస్మస్‌తో క్రీస్తు జననం ద్వారా లోకానికి కొత్త కాంతులు వచ్చాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక మన్నా జూబ్లీ చర్చ్‌లో జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన ఐక్య క్రిస్మస్ వేడుకలకు మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ క్రిస్టియన్లకు పూర్తి స్థాయి భద్రత లభించిందన్నారు. క్రిస్టియన్ కమ్యూనిటీ హాళ్లు, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్స్ వంటి అంశాలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కార్ల్ డేవిడ్ కొమానపల్లి(లాల్), క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌లు పాల్గొన్నారు.



ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలి



ఉప్పలగుప్తంలో నీట మునిగిన నారుమడిని శాస్త్రవేత్తలు, అధికారులకు చూపిస్తున్న రైతు

ఉప్పలగుప్తం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో భారీవర్షాలకు మునిగిన వరి పనలపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చల్లుకుంటే ధాన్యం మొలకెత్తకుండా ఉంటుందని ఏరువాక ప్రధాన కార్యదర్శి బి.భవాని రైతులకు సూచించారు. స్థానిక గ్రామంలో తుపానుకు నీట మునిగిన వరి చేలను, నారుమడులను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎ.రాజశేఖర్, అమలాపురం ఏడీఏ ఎంఏ షంషితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, రైతులు పి.రాంబాబు, ఎం.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణపై వర్క్‌షాపు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మురుగు కాల్వలు, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణపై పట్టణంలోని పారిశుధ్య కార్మికులు, సఫాయి కర్మచారులకు బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సహకారంతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌చే వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్విరాన్‌మెంట్ హెల్త్ సెక్షన్ ఆఫీసర్లు సంతోష్ బమ్మిడి, అడ్మిన్ హరీష్ ఇబ్రహీంలు పారిశుధ్య కార్మికులకు మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. అధునాతన యంత్రాలతో సెప్టిక్ ట్యాంక్‌లను శుద్ధీకరించే విధానాలను వివరించారు. వర్క్ షాపులో మున్సిపల్ ఏఈ వెంకటేష్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

ఐ.పోలవరం: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ అన్నారు. బుధవారం మురముళ్ళలో పాత ఇంజరం ప్రధాన పంట కాలువ విషయమై రైతులు, వర్తకుల మధ్య ఒప్పందం గురించి సమావేశమయ్యారు. కాలువల పనికి ఆటంకం కలగకుండా సాగునీరు రైతులకు అందేలా చర్చలు జరిపారు. పంట కాలువలో సాగునీరు వెళ్ళేలా వర్తకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతువిభాగ కమిషన్ మెంబర్ జున్నూరు బాబి, మురముళ్ళ సర్పంచ్ కాలే రాజబాబు, పాత ఇంజరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.మూలపాలెంనకు చెందిన రైతులు పాల్గొన్నారు.



రైతులు, వర్తకులతో చర్చిస్తున్న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ సత్యనారాయణ

ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే అశోక్ పర్యటన



కురసాంపేటలో పూర్తి కాని కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: మిచాంగ్ తుఫాను నేపథ్యంలో భారీవర్షాలకు ముంపునకు గురైన గ్రామాల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కురసాంపేటలో వర్షపునీరు చేరిన ఇళ్లను ఆయన పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పనులు పూర్తికాక వర్షపు నీరు ప్రవహించక ముంపు బారిన పడుతున్నామని కురసాంపేట గ్రామస్తులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. కల్వర్టు నిర్మాణ పనులు తక్షణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే అశోక్ పీడబ్ల్యూడీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఇంజినీర్లు జ్యోతిరాజు, భాస్కర్, సీఏ షణ్ముగం పాల్గొన్నారు.

భూమి కౌలుకు వేలం

కొత్తపేట: మండలంలోని పలివెల ధర్మసత్రానికి చెందిన 1.69 ఎకరాల భూమి కౌలుకు ఉపయోగించుకునేందుకు వేలం నిర్వహించినట్లు ధర్మసత్రం ఈఓ నడింపల్లి ప్రసాదరాజు తెలిపారు. పలివెల గ్రామం పరిధిలోని ఆ భూమిని 11 సంవత్సరాల పాటు కమర్షియల్‌గా వినియోగించుకునేందుకు బుధవారం ఎండోమెంట్స్ అండ్ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భారతి సమక్షంలో వేలం పెట్టగా బహిరంగ వేలంలో పి.గన్నవరం మండలం పప్పులవారిపాలెం గ్రామానికి చెందిన వాసుకూరి వెంకటసాయిరామ్ హెచ్చు పాటగా నెలకు రూ.23 వేలు శిస్తు చెల్లించేలా పాడుకున్నట్టు ఈఓ ప్రసాదరాజు తెలిపారు. 3 సంవత్సరాల అనంతరం నుంచీ ప్రతి మూడేళ్లకు పాడుకున్న మొత్తంపై 30 శాతం పెంచి చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపకుడు అంబేడ్కర్

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమ సమాజ స్థాపకుడని ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.లోవరాజు, పెన్మత్స చిట్టిరాజు, కాశీ బాలమునికుమారి, రెడ్డి శివన్నారాయణ, కోలా బాబ్జి, దొమ్మేటి అప్పారావు, గణేశుల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు నేతృత్వంలో మండలంలోని అయినాపురం, అనాతవరం, బొండాయికోడు, పల్లిపాలెం సెంటర్, తానేల్లంక తదితర గ్రామాల్లోనూ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.

తాళ్లరేవు: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం, అంబేడ్కర్ భవన్‌ల వద్ద ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎండీయూడబ్ల్యూ అధ్యక్షుడు పెయ్యల రమేష్, సర్పంచ్ పెయ్యల మంగేష్, రాయుడు గంగాధర్, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీను, కుడుపూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక ఎంప్లాయీస్ హోమ్‌లో బుధవారం జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆర్‌పీఐ, జిల్లా దళిత ఐక్యవేదిక, పీడీఎస్‌యూ, విద్యార్థి, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సభలో ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి డీబీ లోక్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావు, జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గోపాల్‌నగర్‌లో అంబేడ్కర్ విజ్ఞానభవన్‌లో అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ అరుశ్ ప్రకాశం, పండు సిద్ధార్థ, గంటా మనోజ్, చెల్లి గోపి, డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లరేవు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, రాయుడు గంగాధర్, పోతుల రత్నకుమారి, తాడి షణ్ముఖరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని కేశనకుర్రు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురముళ్ళ, కొమరగిరి, టి.కొత్తపల్లి, జి.మూలపాలెం, జి.వేమవరం, ఎదుర్లంక, కొమరగిరి తదితర గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నాయకులు నివాళులర్పించారు.



యానాంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ సునీత, ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ తదితరులు



తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అమలాపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు



అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్



కేశనకుర్రులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు